ఒక్కసారి అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా

మలక్‌పేట బీజేపీ అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి



సైదాబాద్‌లో ర్యాలీలో పాల్గొన్న సంరెడ్డి సురేందర్‌రెడ్డి

సైదాబాద్: మలక్‌పేట నియోజకవర్గ సమగ్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని పార్టీ అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారానికి చివరి రోజైన మంగళవారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ, గత 15 సంవత్సరాలుగా బీఆర్‌ఎస్, మజ్లిస్ పార్టీలు పాతబస్తీలో అభివృద్ధిని విస్మరించాయని అన్నారు. మజ్లిస్ నాయకులకు ఈ ఎన్నికల్లో పరాభవం తప్పదన్నారు. మలక్‌పేట వాసులు తనను ఆదరించి ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశమిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. ర్యాలీలో బీజేపీ కార్పొరేటర్లు కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్‌ను గెలిపించండి

–మలక్‌పేట అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి



గాంధీనగర్‌లో ప్రచారం చేస్తున్న తీగల అజిత్‌రెడ్డి

మలక్‌పేట: బీఆర్‌ఎస్‌కు అండగా నిలబడి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆ పార్టీ మలక్‌పేట అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి కోరారు. మంగళవారం మూసారంబాగ్ డివిజన్ ప్రతాప్‌నగర్, గాంధీనగర్‌లలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి నాయకులు పాటేల్ నవీన్‌యాదవ్, శంకర్‌యాదవ్, సుధాకర్ గుప్తా ప్రభు, రాజేష్, ప్రవీణ్, నాగరాజు, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం

- మరోసారి ఆశీర్వదిస్తే ఐదేళ్లు సేవకుడిగా ఉంటా
- ఎల్బీనగర్ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు మరోసారి బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వస్తేనే సాధ్యపడుతుందని ఆ పార్టీ ఎల్బీనగర్ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కొత్తపేట డివిజన్ రాఘవేంద్రనగర్ కాలనీలో డివిజన్ పార్టీ నాయకుడు సాయికుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరయ్యారు. సమ్మేళనానికి హాజరైన వారంతా కారు గుర్తుకు ఓటు వేసి సుధీర్‌రెడ్డిని గెలిపించుకుంటామని ముక్తకంఠంతో ప్రకటించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... మరోసారి తనను ఆశీర్వదించి ఘన విజయం అందిస్తే ఐదేళ్ల పాటు సేవకుడిగా ఉండి ఎల్బీనగర్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సంక్షేమానికి కేసీఆర్ పెద్దపీట వేస్తూ అనేక పథకాలు అమలు చేస్తున్నారని, అందుకే తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇప్పటికే తాను వేల కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టానని, మిగిలి ఉన్న చిన్నపాటి సమస్యలను కూడా ఎన్నికల అనంతరం పూర్తి చేస్తానని అన్నారు. ఎల్బీనగర్‌లోప్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, స్కైవేలు నిర్మించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించానని సుధీర్‌రెడ్డి చెప్పారు. ఎల్బీనగర్‌లో ఏగల్లీ ఎక్కడుందో తెలియని ఇతర పార్టీల అభ్యర్థులు కపట ప్రాంతీయ అభిమానాన్ని ప్రదర్శిస్తూ కల్లబొల్లి మాటలతో మభ్యపెట్టేందుకు యత్నిస్తున్నారని, వారి ఎత్తులను చిత్తు చేయాల్సిన బాధ్యత ఓటర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సాగర్‌రెడ్డి, నాయకులు లింగాల నాగేశ్వరరావు, రాహుల్‌గౌడ్, విజయ, తోట కృష్ణ, అశోక్, బాబు, వెంకటేష్, సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

బీఎస్‌రెడ్డి డివిజన్‌లో...

బీఎస్‌రెడ్డి డివిజన్ శ్రీపురం కాలనీలోని ఎస్‌ఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అనిల్ చౌదరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమ్మ సామాజిక వర్గ ఆత్మీయ సమ్మేళనానికి పార్టీ ఇన్‌చార్జి రామ్మోహన్ గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి హాజరయ్యారు. కమ్మ సామాజిక వర్గం వారిని ఓటు అడిగే హక్కు తనకే ఉందని, వారంతా కలిసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కోవి కొండల్ రావు, సాంబయ్య, కొమ్మి హరిబాబు, జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌ఐ యూకే బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అశోక్‌గౌడ్

భారీ మెజార్టీతో గెలిపించాలి: ఎన్‌ఆర్‌ఐ అశోక్‌గౌడ్

నియోజకవర్గంలోని సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే సత్తా ఉన్న బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎన్‌ఆర్‌ఐ, యూకే బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు అశోక్ గౌడ్ కోరారు. చంపాపేట డివిజన్ బైరామల్‌గూడలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో యూకే బీఆర్‌ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు నవీన్ రెడ్డి, కోశాధికారి సతీష్ రెడ్డి, కోఆర్డినేటర్ సుభాష్ కుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

బీజేపీ గెలిస్తేనే పాతబస్తీ అభివృద్ధి

యాకుత్‌పురా అభ్యర్థి వీరేంద్రబాబు యాదవ్

సైదాబాద్: బీజేపీ గెలిస్తేనే పాతబస్తీలో సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని యాకుత్‌పురా బీజేపీ అభ్యర్థి ఎన్.వీరేంద్రబాబు యాదవ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో చివరి రోజైన మంగళవారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీలలో భారీ ర్యాలీ నిర్వహించారు. యువమోర్చా నాయకులు తమ వాహనాలపై పార్టీ జెండాలతో నినాదాలు చేస్తూ ర్యాలీలో సందడిగా సాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రచార సమయంలో యాకుత్‌పురాలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు తమను ఆదరించారని తెలిపారు. దశాబ్దాల కాలంగా నియోజకవర్గంలో మజ్లిస్ ఆగడాలతో ఇబ్బందులు పడిన యాకత్‌పురా ప్రజలు ఈ ఎన్నికల్లో వారికి తగిన గుణపాఠం చెప్పి, తనను భారీ మెజారిటీతో గెలిపిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేసారు. ర్యాలీలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న వీరేంద్రబాబు యాదవ్

మహాత్మా జ్యోతిరావు పూలేకు ఘన నివాళి



మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నేత ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్

మన్సూరాబాద్: మహాత్మా జ్యోతిరావు పూలే 133వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఎల్‌బీనగర్‌లోని మహాత్మా జ్యోతి రావుపూలే విగ్రహానికి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, టీఆర్‌ఎస్ నేత ముద్దగౌని రాంమ్మోహన్‌గౌడ్, నాయకులు పోచబోయిన జగదీష్‌యాదవ్, రుద్రయాదగిరి, టంగుటూరి నాగరాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నిబద్ధతతో కూడిన రాజకీయాలే నా లక్ష్యం

- సుధీర్‌రెడ్డి ఆగడాలకు ఓటుతోనే చెక్ పెట్టాలి
- బీజేపీ ఎల్‌బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి

మన్సూరాబాద్/చంపాపేట్: గత 16 సంవత్సరాలుగా ఎలాంటి పదవీ లేకున్నా ప్రజాసేవలో ఉండి, నిబద్ధతతో కూడిన రాజకీయాలు చేశానని బీజేపీ ఎల్‌బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి స్పష్టంచేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం చంపాపేట డివిజన్‌లో పాదయాత్ర, గడ్డిఅన్నారం, కొత్తపేట, బీఎన్‌రెడ్డినగర్, వనస్థలిపురం, మన్సూరాబాద్, నాగోలు, హయత్‌నగర్, హస్తినాపురం, లింగోజిగూడ, చైతన్యపురి డివిజన్లలో ఆయా కార్పొరేటర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో సామ రంగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదవులు, ఆక్రమంగా ఆస్తులు సంపాదించుకోవటానికి రాజకీయాల్లోకి రాలేదని, మీలో ఒకడిగా ఉన్నానని, ఒక్క అవకాశం ఇవ్వండని ఎల్‌బీనగర్ ప్రజలను వేడుకున్నారు. ఎల్‌బీనగర్ ప్రజలు బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో పాటు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నియంతృత్వ విధానాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అవినీతి రహిత పాలన అందిస్తానని, మంచి కోసం బీజేపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఇలా ఉండగా, మన్సూరాబాద్‌లో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు భారీ ర్యాలీని నిర్వహించారు.



చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డితో కలిసి పాదయాత్ర చేస్తున్న బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి



కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్‌తో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్న సామ రంగారెడ్డి

ఓటు చాలెంజ్!

- ఓటు వేశాక సెల్ఫీ దిగి వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు
- ఓటర్లలో ఉత్సాహం నింపేలా వినూత్న కార్యక్రమాలు
- పోలింగ్ శాతం పెంచేందుకు కాలనీ సంఘాల చొరవ

సాక్షి, సిటీబ్యూరో: గ్రీన్ చాలెంజ్, బకెట్ చాలెంజ్ తరహాలోనే ఓటు చాలెంజ్‌కు కాలనీ సంఘాలు తెర లేపాయి. గ్రేటర్‌లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు, యువ ఓటర్లలో చైతన్యం నింపేందుకు యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ (యూ–ఎఫ్‌ఆర్‌డబ్ల్యూఏఎస్) పలు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ప్రౌడ్ ఓటరు, ఫ్యామిలీతో సెల్ఫీ.. అనే కార్యక్రమాలను చేపడుతున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి బీటీ శ్రీనివాస్ తెలిపారు. కుటుంబంతో కలిసి ఉదయమే ఓటు వేసి, సిరా చుక్కను చూపిస్తూ సెల్ఫీ దిగాలని, ఆయా ఫొటోలను కాలనీ సంఘాల వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేయాలని సూచించారు. కాలనీలో ఇతరులకు ఓటు వేయాలని చాలెంజ్ చేయాలని తెలిపారు.



డివిజన్ స్థాయిలో వాట్సాప్ గ్రూప్‌లు..

నగరంలోని 4,800 కాలనీల్లో పోలింగ్ శాతం తక్కువగా ఉన్న ప్రాంతాలను ఎంచుకొని డివిజన్ స్థాయిలో వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో డివిజన్‌లో 800–900 మంది సభ్యులున్నారు. ఈనెల 30న పోలింగ్ రోజు ఉదయమే ఓటేశాక కుటుంబ సభ్యులంతా కలిసి వేలిపై సిరా చుక్కను చూపిస్తూ సెల్ఫీ దిగి కాలనీ వాట్సాప్ గ్రూప్‌లలో పెట్టాలని అసోసియేషన్ ప్రతినిధులు సూచించారు. ఆ రోజు ఎలాంటి పనులున్నా వాయిదా వేసుకోవాలని, వేడుకలకు హాజరవ్వాల్సి ఉంటే సమయాన్ని సర్దుబాటు చేసుకోవాలని సూచించారు. పోలింగ్‌కు ముందురోజు కాలనీ వాసులంతా సమూహంగా బూత్ వరకు ఈవినింగ్ వాక్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ప్రధానంగా 40–55 శాతం మాత్రమే పోలింగ్ నమోదైన కాలనీల్లో ఈసారి 60 శాతం కంటే ఎక్కువ ఓటింగ్ జరగాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టారు.

ఓటేసేందుకు ఊరు పిలుస్తోంది!

నగరం నుంచి స్వగ్రామాలకు వెళ్తున్న జనం

ఎల్‌బీనగర్: గత ఇరవై రోజులుగా ఒకటే సందడి.. ఎన్నికల పాటలతో చెవులు మోతెక్కాయి. ఇక అవన్నీ ఆగిపోయే సమయం ఆసన్నమైంది. ఇప్పుడు ఊరు వంతొచ్చింది. తన బిడ్డలను ఎక్కడున్నా వచ్చి ఓటేసి పొమ్మంటోంది. ప్రచారం మంగళవారం సాయంత్రం ముగిసింది. 29న అధికారులు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్‌కు ఏర్పాట్లు చేశారు. 30న ఓటర్లు తమ హక్కును వినియోగించుకొనేందుకు ఊరు బాట పడుతున్నారు.

ఓటు మన బాధ్యత...

ఐదేళ్లపాటు రాష్ట్ర ప్రజల భవిష్యత్‌ను నిర్దేశించే ఎన్నికలను ప్రజలు విస్మరించొద్దు. మన ఓటు ద్వారా ప్రజల ఆంకాక్షలు నెరవేర్చ నాయకుడు ఎన్నికవుతాడన్న విషయం గ్రహించాలి.

- నవంబర్ 30న పోలింగ్ నిర్వహిస్తున్నట్లు దాదాపు 50రోజుల క్రితమే ప్రకటించారు. సుదీర్ఘ సమయం లభించింది. ఓటు వేయడం తమ బాధ్యతఅనే అంశం గుర్తించాలి. పోలింగ్ రోజైన గురువారం ఇప్పటికే సెలవుగా ప్రకటించారు. ప్రయాణాలు శుభకార్యాలు పెట్టుకున్న వారు ఓటేసిన తర్వాత ఆ పనులు చూసుకోవాలి. సమయం లేదు అని చెప్పడం బాధ్యతారాహిత్యమే అవుతుంది. ఓటేసే ఉద్దేశం సంకల్పం ఉంటే సమయం కచ్చితంగా చిక్కుతుంది.
- నగరంలో ఉంటున్న నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం తదితర ప్రాంతాలకు చెందిన వారందరూ మంగళవారం నుంచే ఊరు బాట పట్టారు. ఉపాధి, విద్య తదితర అవకాశాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లిన వారంతా ఊళ్లబాట పడితే ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది.



నగరం నుంచి ఊళ్లకు వెళ్తున్న ఓటర్లు

తలసీమియా రోగులకు రక్తం కొరత

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుతం ఓ వైపు ఎన్నికల సందడి కొనసాగుతోంది. దీని కారణంగా బ్లడ్ బ్యాంకులు, హాస్పిటల్స్‌లో తీవ్రమైన రక్తనిల్వల కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో తలసేమియా సికిల్ సెల్ సొసైటీ (టిఎస్సిఎస్)సెక్రటరీ డాక్టర్ సుమన్ జైన్ ఓ ప్రకటనలో రక్తదానం కోసం దాతలకు అత్యవసర విజ్ఞప్తి చేశారు. తలసీమియా రోగులు, వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రమం తప్పకుండా రక్తమార్పిడిపై ఆధారపడతారనీ, ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా రక్త లభ్యత తగ్గిపోయి రోగులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ రోగుల వినియోగార్థం సాధారణంగా 600–700 యూనిట్ల రక్తం అవసరం కాగా ఇప్పుడు కేవలం 100 యూనిట్ల రక్తం మాత్రమే అందుబాటులో ఉందన్నారు, మరీ ముఖ్యంగా కొన్ని బ్లడ్ గ్రూపులు పూర్తిగా అందుబాటులో లేవని, ఆసుపత్రులు బ్లడ్ బ్యాంకులు దగ్గర రక్తదానం బాగా తగ్గిపోయిందని వెల్లడించారు..

చార్మినార్ అభ్యర్థి మేఘా రాణి అగర్వాల్‌పై చర్యలు వద్దు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున చార్మినార్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న మేఘా రాణి అగర్వాల్‌తో పాటు పవన్ మిస్త్రాపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ర్యాలీలో జరిగిన వివాదంపై వివరణ ఇచ్చేందుకు వారు సిద్ధంగా ఉన్నందున, వారి వివరణ వినాలని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు వెలువడిన నాటి నుంచి 3 రోజుల్లో సీఆర్‌పీసీ 41ఏ నోటీసులకు వివరణ ఇవ్వాలని పిటిషనర్లకు చెప్పింది. హైదరాబాద్ హుస్సేనీ ఆలం పోలీస్‌స్టేషన్‌లో తమపై దాఖలైన కేసులో అరెస్టు సహా ఇతర చర్యలు చేపట్టకుండా పోలీసులను ఆదేశించాలని కోరుతూ మేఘా రాణి అగర్వాల్‌తో పాటు మరొకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మాధవీదేవి విచారణ చేపట్టారు. పిటిషనర్ న్యాయవాది అంజలి అగర్వాల్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లలో ఒకరైన మేఘా రాణి అగర్వాల్ చార్మినార్ నుంచి పోటీ చేస్తున్నారని, ఈ నెల 9న నిర్వహించిన ర్యాలీ సందర్భంగా కొంత గందరగోళం చోటుచేసుకుందన్నారు. ర్యాలీలో గందరగోళంపై ఎండీ. జాఫర్ ఖాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పిటిషనర్లపై కేసు నమోదైంది. 22న పిటిషనర్లకు పోలీసులు 41ఏ నోటీసులు జారీ చేశారు. పిటిషనర్లు వివరణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, పోలీసులు అరెస్టు సహా ఎలాంటి చర్యలు చేపట్టకుండా ఆదేశాలివ్వాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. వివరణ ఇచ్చేందుకు వారికి అవకాశం ఇవ్వాలని ఆదేశిస్తూ, పిటిషన్‌లో వాదనలను ముగించారు.

అతిక్రమిస్తే పోలీసుల్నీ వదలను

ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారం నడవాల్సిందే

- నగరంలో 666 క్రిటికల్ పోలింగ్ లొకేషన్ల గుర్తింపు
- ఓటర్ల భద్రతకు పూర్తి భరోసా: సిటీ సీపీ సందీప్ శాండిల్య



సాక్షి, సిటీబ్యూరో: 'నేను ప్రతి అంశాన్నీ నిబంధనలకు అనుగుణంగానే పరిగణనలోకి తీసుకుంటా. పోలీసు అధికారులు సహా ఎవరైనా వీటిని అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదు' అని నగర పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య స్పష్టం చేశారు. పోలింగ్ నేపథ్యంలో తీసుకుంటున్న, ఇప్పటి వరకు చేపట్టిన చర్యలపై ఆయన మంగళవారం వీడియో సందేశం విడుదల చేశారు. అందులోని అంశాలు ఆయన మాటల్లోనే..

- నగరంలో ప్రశాంత వాతావరణం కోసం అన్ని స్థాయిలకు చెందిన పోలీసులు నిర్విరామంగా శ్రమించారు. దీనికి ప్రతిఫలంగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి. జిల్లాల్లో ఓటింగ్ శాతం ఎక్కువ ఉంటోంది. నగరంలో మాత్రం 40 నుంచి 50 శాతం మాత్రమే నమోదు అవుతోంది. పోలీసులు తమ విధులు నిర్వర్తించినట్లే ఓటర్లు ఓటు వేసి తమ విధి పక్కాగా నిర్వహించాలి. డ్రైవింగ్ లైసెన్సు, సరైన పత్రాలు, నిబంధనలకు తగ్గట్టు నెంబర్ ప్లేట్ లేని వాహనాలు పోలింగ్ రోజు తారసపడినా సీజ్ చేస్తాం.
- ఓటు వేయడానికి ఏ వాహనంపై వస్తున్నారో, దాని పత్రాలు, నెంబర్ ప్లేట్ పక్కాగా ఉండటంతో పాటు ఓటరు హెల్మెట్ ధరించడం కూడా కచ్చితం. ఈ నెల 9 నుంచి ఇప్పటి వరకు 2.5 లక్షల వాహనాలను తనిఖీ చేశాం. ప్రతి రోజూ సరైన పత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని 20 నుంచి 25 వాహనాలను స్వాధీనం చేసుకున్నాం. ఎన్నికల ప్రక్రియ తర్వాతే వీటిని తిరిగి వస్తాం. నగరంలోని 31 ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహిస్తున్నాం. 40 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలు అదనంగా వచ్చాయి. ఇప్పటి వరకు నగర పోలీసులు రూ.63 కోట్ల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నాం. 2400 నాన్ బెయిలబుల్ వారెంట్లు ఎగ్జిక్యూట్ చేయడంతో పెండెన్సీ లేదు. మినహాయింపులు పొందినవి మినహా అన్ని ఆయుధాలు డిపాజిట్ అయ్యాయి. నగరంలో 1600 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేశాం. ప్రతి రోజూ వీరిపై నిఘా ఉంచి కనీసం 600 మందిని వ్యక్తిగతంగా తనిఖీ చేస్తున్నాం.
- బుధ, గురువారాలు మాకు అత్యంత కీలకం. దానికి తగ్గట్టు పోలీసు విభాగం సమాయత్తమైంది. 1700 పోలింగ్ లోకేషన్స్ ఉన్న రెవెన్యూ మార్గాల పైనా ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. ఈ పోలింగ్ లోకేషన్స్‌లో 4915 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఇవన్నీ సీసీ కెమెరాల నిఘాలో ఉంటాయి. ఈ లోకేషన్లలో 666 క్రిటికల్‌గా నిర్ధారించాం. అక్కడ కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో గుమిగూడితో అదుపులోకి తీసుకుని పోలింగ్ తర్వాత వదిలి పెడతాం. ఓటు వేసిన వెంటనే మీ ఇళ్లకు వెళ్లి కుటుంబాలతో గడపండి. 21 మంది పరిశీలకులు సైతం సీసీ కెమెరాల్లోని దృశ్యాలను సమగ్రంగా అధ్యయనం చేస్తారు. బెదిరింపులు, హెచ్చరికలు, అమర్యాదగా మాట్లాడటం ఇలాంటి ఏ అంశాన్నీ పోలీసులు ఉపేక్షించరు. వీటికి పాల్పడిన వారిని తక్షణం అరెస్టు చేస్తారు. ఈ అంశంలో విఫలమైన అధికారుల పైనా చర్యలు ఉంటాయి. నగదు, మద్యం సహా ప్రలోభాల పంపిణీకి ప్రయత్నించినా కఠిన చర్యలు తీసుకుంటాం. నగరంలో ఉన్న అన్ని నియోజకవర్గాలను పరిగణలోకి తీసుకున్న బందోబస్తు, భద్రత ఏర్పాటు చేస్తున్నాం.

తెలంగాణకు బీసీని సీఎంగా చేయాలి

హిమాయత్‌నగర్: తెలంగాణకు సుకబడిన కులాలకు చెందిన వ్యక్తిని సీఎంగా చేయాలని, ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చినా ఇదే నిర్ణయం తీసుకోవాలని బీసీ ముఖ్యమంత్రి సాధన సమితి చైర్మన్ ప్రొ.గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ఇప్పటికే బీజేపీ బీసీ సీఎంను ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. బీసీలంతా పార్టీలకు అతీతంగా బీసీ అభ్యర్థులను గెలిపించాలని అఖిల భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఓం ప్రకాష్ యాదవ్, లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ యాదవ్‌లతో కలిసి గాలి వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా బీసీని సీఎం చేయాలని, లేనిపక్షంలో 2024లో జరగబోయే ఎన్నికల్లో ఆయా పార్టీలను భూస్థాపితం చేస్తామన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు బీసీ సీఎంను ఎందుకు ప్రకటించలేదనీ. బీసీలు ఓట్లు వేయకపోతే ఆ పార్టీలు ఎలా అధికారంలోకి వస్తాయని ప్రశ్నించారు. అఖిలభారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి రవి, కార్యదర్శి సుదర్శన్ నేత, సుప్రీంకోర్టు న్యాయవాది సురేందర్, న్యాయవాదులు వినోద్ కుమార్, హనుమంతరావు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



విజ్ఞులైన ఎల్.బి. నగర్ నియోజకవర్గ ప్రజానీకానికీ విన్నపం.
మీరు ఓటు వేసే ఆ క్షణం మనసా ! వాచా!! కర్మణా!!! ఆలోచించండి...



ఎల్బీనగర్‌లో అభివృద్ధి జరిగిందా ? లేదా ? గతంలో జరిగిన అభివృద్ధి ఎంత ?
ఇప్పుడు జరిగిన అభివృద్ధి ఎంత ? భవిష్యత్తులో జరగబోయే అభివృద్ధి ఎంత ?

ఎల్బీనగర్ నియోజకవర్గంలో గత 5 ఏండ్లలో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, ఫ్లై ఓవర్లు, మౌలిక వసతులలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయి. మౌలిక వసతులు సమస్యను అధిగమించాం. 2014 ముందు ఇండ్లలో ఇన్వర్టర్లు ఉండేవి. సి.ఎం. కేసీఆర్ గారి ముందు చూపు వల్ల నేడు ఇన్వర్టర్ల బాధ తెలంగాణ ప్రజలకు తప్పింది.

శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారు
ఎమ్మెల్యే ఎల్.బి.నగర్ నియోజకవర్గం

అయితే భవిష్యత్తులో పెరిగే జనాభాకనుగుణంగా, ఈతరం, రాబోయే తరం కోసం చేయాల్సిన పనులు ఇంకా ఉన్నాయి. అవి...

ఎల్బీనగర్‌లోని అన్ని కాలనీలలో మౌలిక సదుపాయాలు మరిన్ని కల్పించాలి. వీటితో పాటు వాటర్, డ్రైనేజీ, రోడ్లు, వీధిదీపాలు, కమ్యునిటీ హాళ్లు, ప్లే గ్రౌండ్స్ ఇంకా నిర్మించాలి. ఎల్బీనగర్‌కు ముఖ్యంగా ట్రాఫిక్ రద్దీ తగ్గింపునకు ఫ్లైఓవర్ల నిర్మాణం, చెరువులలో కాలుష్య నివారణ, బడుల్లో మరిన్ని వసతులు, కాలనీలలో బస్తీ దవాఖానాలు, యు.పి.హెచ్.సి.లు ఏర్పాటు చేయాలి.

-: ట్రాఫిక్ :- రాబోయే రోజుల్లో ఎల్బీనగర్‌కు పెను సవాల్ విసిరేది ట్రాఫిక్ సమస్య. ఇది చాలా తీవ్రమైంది. దీనిని పరిష్కరించకపోతే తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతాయి. దీనిని అధిగమించాలంటే అడపా, దడపా కాకుండా ఇప్పటినుంచే సమగ్రమైన ప్రణాళిక రూపొందించుకోవాలి.

ఎల్బీనగర్‌లో అత్యంత ట్రాఫిక్ ఇబ్బందులున్న ప్రాంతాలివి... ✦ రైతుబజార్ - వనస్థలిపురం డివిజన్ ✦ బిఎన్ రెడ్డి నగర్ సర్కిల్ - వనస్థలిపురం డివిజన్ ✦ తెలంగాణ చౌరస్తా - హస్తినాపురం డివిజన్ ✦ సరూర్ నగర్ పోస్టాఫీస్, సరూర్‌నగర్ డివిజన్ / లింగోజిగూడ ✦ గాంధీబొమ్మ - సరూర్‌నగర్ ✦ ఓమ్నీ హాస్పిటల్ దాటాక కొత్తపేట గ్రామం వెళ్లేదారిలో విపరీతమైన ట్రాఫిక్ ✦ ఆనంద్ నగర్ చౌరస్తా - నాగోల్ డివిజన్ ✦ కామినేని హాస్పిటల్ నుంచి మన్సూరాబాద్ వెళ్లే దారిలో విఠల్ రెడ్డి ఇంటిముందు టీ షేప్‌లో విపరీతమైన ట్రాఫిక్ సమస్య ✦ చంపాపేట్ గ్రామంలో రిజిస్ట్రేషన్ ఆఫీస్ జంక్షన్లో విపరీతమైన ట్రాఫిక్.

ఫ్లై ఓవర్లు అవసరం ఉన్న ప్రాంతాలు... ✦ ఆనంద్‌నగర్ జంక్షన్‌లో ఫ్లై ఓవర్ ✦ హస్తినాపురం జిఎస్ఆర్ ఫంక్షన్ హాల్ దాటిన తర్వాత సాగర్ కాంప్లెక్స్ వరకు ఫ్లైఓవర్ ✦ డి మార్ట్, చంపాపేట్ నుంచి బాంటియా ఫర్నిచర్ షాప్ వరకు, బైరామల్ గూడ. ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు ఈ నిర్ణయాలు తీసుకోవాలి. అయితే ఇవి వారం, పది రోజుల్లో జరగవు. ఈ ఫ్లై ఓవర్లు ఆలోచన చేస్తే అది కట్టి, దాని ఫలం ప్రజలకు అందించాలంటే కనీసం 5 నుంచి 7 సంవత్సరాలు పడుతుంది. ప్రస్తుతం 2023లో మనం ఉన్నాం. ఆలోచన చేసి పెట్టాం, ఆచరణలోకి రావడానికి 2030 అవుతుంది.

లైవ్ సెప్టిక్ ట్యాంకులు మన చెరువులు... చేయాలి చెరువుల సుందరీకరణ ✦ బైరామల్ గూడ బండ్ ఏర్పాటు చేశాం, ✦ సరూర్‌నగర్ చెరువు బండ్ నిర్మాణం జరుగుతుంది, ✦ మన్సూరాబాద్ పెద్ద చెరువును బాగా డెవలప్ చేశాం. కానీ వీటిని మరింత బాగు చేసే ముందు, వీటిలోకి వచ్చే డ్రైనేజీ నీటిని మూసీలోకి మళ్లించాలి. ఇందులో వర్షపు నీరు మాత్రమే వచ్చేలా ప్లాన్ చేయాలి. ఇది చేయడానికి కనీసం 3-5 సంవత్సరాలు పడుతుంది. చెరువులలో నీటిని శుద్ధి చేయడానికి సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్.టీ.పి) పెట్టాలి, అప్పుడు చెరువుల్లోని నీరు శుద్ధి అవుతుంది. అప్పుడుగానీ మన చెరువుల దుస్థితి మారదు.

ఈతరానికి, రాబోయే తరానికి ఈ చర్యలు చాలా అవసరం. అలా నీటిని శుద్ధి చేసి, సుందరీకరణ చేయాల్సిన చెరువులు ఇవి.

✦ సరూర్‌నగర్ చెరువు ✦ మన్సూరాబాద్ పెద్ద చెరువు ✦ మన్సూరాబాద్ చిన్న చెరువు ✦ నాగోల్ చెరువు ✦ బండ్లగూడ చెరువు ✦ కుమ్మరికుంట చెరువు ✦ హయత్‌నగర్ చెరువు ✦ బాతుల చెరువు ✦ ఫతుల్లాగూడ చెరువు. ✦ లక్ష్మి భవాని నగర్ కాలనీ (హత్తిగూడ) చెరువు. ✦ బైరామల్‌గూడ చెరువు.వీటిల్లోకి మురుగు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలి, వీటిలో సీవరేజ్ ప్లాంట్లు పెట్టాలి. వీటికి కనీసం 1000 కోట్ల రూపాయల వ్యయం అవుతుందని అంచనా.

-: స్కూల్స్ :- పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు పెంచాలి. అదనపు తరగతులు, మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయాలు కల్పించాలి, టాయిలెట్ల నిర్వహణకు ఒక వ్యవస్థ ఏర్పాటు చేయాలి.

-: వైద్యం :- ఎల్బీనగర్‌లో బస్తీ దవాఖానాలు ఇంకో ఐదారు ఏర్పాటు చేయాలి. యు.పి.హెచ్.సిలు 2 ప్రాంతల్లో పెట్టాలి. ఆ ప్రాంతాలు...

1. బంజారాబస్తీ దగ్గర - బంజారాబస్తీ, అంబేద్కర్ నగర్, రంగనాయకులు గుట్ట, సుధీర్ కాలనీ, హయత్ నగర్ పాతగ్రామ హరిజన బస్తీవారికి ఉపయోగం ఉంటుంది.
2. ఫతుల్లాగూడలో, దవాఖానా కోసం స్థలం ఇప్పటికే గుర్తించాం, దీనివల్ల ఫతుల్లాగూడ గ్రామం, సర్వే నెంబర్ 58, చుట్టుప్రక్కల పేదలకు ఉపయోగం ఉంటుంది.

సీనియర్ సిటిజన్ భవన నిర్మాణం ఎల్బీనగర్ నియోజకవర్గ సీనియర్ సిటిజన్ల కోసం హయత్‌నగర్‌లో సీనియర్ సిటిజన్ భవన్ కట్టిస్తాం.

కాలుష్య రహిత ఎల్బీనగర్ హరితహారం ద్వారా ముఖ్యమంత్రి కేసిఆర్ తెలంగాణలో పచ్చదనాన్ని గణనీయంగా పెంచి, కాలుష్యాన్ని తగ్గించారు. ఇదే స్ఫూర్తితో ఎల్బీనగర్‌ను వచ్చే ఐదేళ్లలో కాలుష్యరహితంగా చేయాలన్నదే సంకల్పం కావాలి.

ఎల్బీనగర్‌లో ప్రజల అవస్థలు తగ్గించడానికి, మౌలిక వసతులు కల్పించడానికి ఇవి చేయాలి.

మరి వివిధ పార్టీల నుంచి పోటీచేస్తున్న ప్రస్తుత ఎల్.బి.నగర్ అభ్యర్థులకు ఈ సమస్యలపై అవగాహన ఉందా ? వీటిమీద ఆలోచన చేయగలరా ? పరిష్కారం సూచించగలరా ?



భవాని ప్రవీణ్
మాజీ కార్పోరేటర్ గడ్డి అన్నారం డివిజన్

కాబట్టి ఎల్బీనగర్ ప్రజలారా ...అవగాహన లేనివారికి, అనుభవం లేనివారికి అధికారం ఇద్దామా ? ఆగం అవుదామా ?

విజన్ ఉండి, అనుభవం కలిగి, అమలు చేసే చిత్తశుద్ధి ఉన్న నాయకున్ని ఎన్నుకుని, అభివృద్ధి అవుదామా ?
మీరే ఆలోచించండి, నిర్ణయం తీసుకోండి, మీ అమూల్యమైన ఓటును సరైన అభ్యర్థికి వేయండి.

పైన చెప్పిన విషయాలన్నింటి మీద సంపూర్ణమైన విషయ పరిజ్ఞానము మరియు విజ్ఞత కలిగిన మన శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారి వల్లనే సాధ్యం అని ఎల్.బి. నగర్ ఓటర్లతో పాటు నేను కూడా నమ్ముతున్నాను. కాబట్టి ఈ విషయాలన్నింటినీ పరిగణలోనికి తీసుకొని శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారి కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించగలరు. జై తెలంగాణ ....

ప్రజా సేవే నా లక్ష్యం.. ఎమ్మెల్యేగా గెలిపించండి!

ఎల్బీనగర్ ప్రజలకు కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ విజ్ఞప్తి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ప్రజా సేవ చేయాలనే ఉద్దేశంతో నియోజకవర్గ ప్రజలకు ఎంఎల్‌ఏ జాబుకు దరఖాస్తు పెట్టుకున్నానని, నా చదువు, అనుభవం, ఆశయాలను గుర్తించి నన్ను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గం అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ కోరారు. మంగళవారం వనస్థలిపురం పార్టీ కార్యాలయంలో సీపీఐ, టీజేఎస్ నాయకులతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ బిడ్డల భవిష్యత్ కోసం జరుగుతున్న ఎన్నికలలో తనకు సీపీఐ. తెలంగాణ జన సమితి, ప్రజా సంఘాలు, రైతు సంఘాలు, బీసీ సంఘాలు మద్దతు ఇస్తున్నాయన్నారు. విద్యార్థి దశ నుంచే నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నానని, విద్యార్థి దశంలో రాజీవ్‌గాంధీ తనకు ఆదర్శమన్నారు. రాజకీయాల్లోకి వచ్చాక తన సొంత ప్రాంతం హయత్‌నగర్ అయినప్పటికీ ఇక్కడ ఖాళీ లేకపోవడంతో రాహుల్ గాంధీ సూచనల మేరకు నిజామాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచానని అన్నారు. ఎన్నో నిధులతో, అవినీతికి తావులేకుండా నిజామాబాద్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో తాను సైతం కీలకపాత్ర పోషించానన్నారు.

కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేసిన సుధీర్‌రెడ్డి...

కార్పొరేటర్‌గా రెండు సార్లు, హుడా చైర్మన్‌గా ఒక సారి, ఎమ్మెల్యేగా రెండుసార్లు కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇస్తే తన స్వలాభం కోసం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పార్టీకి ద్రోహం చేసి బీఆర్‌ఎస్‌లో చేరారని మధుయాష్కీ అన్నారు. కోట్లాది రూపాయల నిధులతో ఎల్‌బీనగర్ అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే చెపుతున్నారని, కానీ రోషన్‌దాలాలో తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెరువులు కబ్జాలకు గురై మురికి కూపాలుగా మారాయన్నారు. మూసీ పరివాహక ప్రాంతాలైన నాగోలు, కొత్తపేట ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారన్నారు.

బీజేపీ అభ్యర్థికి పార్టీలు మారడం వెన్నతో పెట్టిన విద్య...

బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్న సామ రంగారెడ్డికి పార్టీలు మారడం వెన్నతో పెట్టిన విద్య అని మధుయాష్కీ గౌడ్ విమర్శించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ రెండు పార్టీలు ఒకటేనని అన్నారు. బీజేపీ సింగిల్ డిజిట్‌కే పరిమితం అవుతుందన్నారు. సరైన అభ్యర్థిని ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు.

తెలంగాణ ఉద్యమంలో మధుయాష్కీది కీలకపాత్ర...

తెలంగాణ ఉద్యమంలో మధుయాష్కీది కీలకపాత్ర అని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ నేషనల్ కౌన్సిల్ మెంబర్ పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని, తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు.

నా శ్వాస, ధ్యాస ఎల్‌బీనగర్...

నా శ్వాస, ధ్యాస ఎల్‌బీనగరేనని, తాము అధికారంలోకి వస్తే తాను కీలక పదవిలో ఉంటానని, అధిక నిధులు తీసుకువచ్చి ఎల్‌బీనగర్‌ను అభివృద్ధి చేస్తానని మధుయాష్కీ అన్నారు. బీఎన్‌రెడ్డినగర్‌లో 118 జీఓను సవరింపజేసి ఇళ్ల రెగ్యులరైజేషన్, 26 ఉప కులాల రిజర్వేషన్ల పునరుద్ధరణ బాధ్యత తనదేనని అన్నారు. యువతకు ఉద్యోగాలు రావాలన్నా కాంగ్రెస్‌తోనే సాధ్యమని, సంవత్సర కాలంలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తనకు మద్దతు ప్రకటిస్తూ లేఖ పంపించారన్నారు. కాగా, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న జెల్లా నాగార్జున సమావేశంలో మధుయాష్కీకి తన మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, వజీర్ ప్రకాష్‌గౌడ్, జితేందర్, సామ రాంమోహన్‌రెడ్డి, సదాశివుడు, జన సమితి నాయకులు పాల్గొన్నారు.

మధుయాష్కీ ఇంటికి సీపీఐ నేత నారాయణ

హయత్‌నగర్: ఎల్‌బీనగర్ కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్‌ను సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మంగళవారం సాయంత్రం కలిశారు. ప్రచార సమయం ముగిసిపోవడంతో హయత్‌నగర్ పాత గ్రామంలో ఉన్న మధుయాష్కీ స్వగృహానికి నారాయణ వెళ్లారు. ఈ సందర్భంగా యాష్కీ కుటుంబసభ్యులతో ఆయన మాట్లాడారు. పురాతనమైన వారి ఇంటి గురించి, అప్పటి జీవిన విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. నారాయణ వెంట సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, మండల కార్యదర్శి శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మహేశ్వరంలో కాషాయ జెండా ఎగురవేస్తాం

బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్



మహేశ్వరంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డితో కలిసి బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

మహేశ్వరం: బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు ఎన్ని కుట్రలు పన్నినా మహేశ్వరంలో కాషాయ జెండా ఎగురవేయడం ఖాయమని మహేశ్వరం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మహేశ్వరం మండలంలోని పలు గ్రామాల్లో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీకి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. పార్టీలు మారే వ్యక్తులను ఈ ఎన్నికల్లో ఓడించి ఇంటికి సాగనంపాలన్నారు. ఇన్నాళ్లు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పాలనలో మహేశ్వరం దోపిడీకి గురైందన్నారు. బీసీ బిడ్డ అయిన తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. అంతకు ముందు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అందెల శ్రీరాములు యాదవ్ స్థానిక నాయకులు, కార్యకర్తలతో బైక్‌ర్యాలీ నిర్వహించారు. టౌన్ బీజేపీ నాయకులు క్రేన్ సహాయంతో భారీ గజమాలను అందెలకు వేసి ఘనంగా సన్మానించారు. మహేశ్వరం టౌన్‌లో రోడ్ షో నిర్వహించి కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి శ్రీరాములు యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు బస్వ పాపయ్య గౌడ్, కడారి జంగయ్య యాదవ్, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.



మహేశ్వరంలో అందెల శ్రీరాములు యాదవ్ నుదుట తిలకం దిద్ది హారతులు ఇస్తున్న మహిళలు

మహేశ్వరం అభివృద్ధే నా అభిమతం

బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి



మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధే తన అభిమతమని, వేల కోట్ల రూపాయల నిధులు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దానని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి పట్లోళ్ల సబితారెడ్డి అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ, గతంతో పోలిస్తే బీఆర్‌ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ నాయకత్వంలో మహేశ్వరంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. నియోజకవర్గంలోని రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, నూతన కళాశాలలు, పాఠశాలలు, నూతన ప్రభుత్వ కార్యాలయాలు, పార్కుల అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించామన్నారు. గ్రామాల్లో ఇళ్లు లేని పేదలకు 75 గజాల స్థలంతో పాటు అర్హత కలిగిన పేదలకు డబుల్ బెడ్ రూమ్స్, దళిత బంధు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రైతు బంధు, రైతు బీమా ,బీసీ బంధు పలు సంక్షేమ పథకాలు అమలు చేసి ఎంతో మందికి లబ్ధి చేకూర్చామన్నారు. నియోజకవర్గంలో ఎన్నో మంచి పనులు చేసిన తనను మహేశ్వరం ప్రజలు కారు గుర్తుపై ఓటు వేసి మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపిస్తారని సబితారెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

గెలిచాక ఐదు వాగ్దానాలను నెరవేరుస్తా

మహేశ్వరం బీఎస్‌పీ అభ్యర్థి కొత్త మనోహర్‌రెడ్డి



ఐదు హామీలను నెరవేరుస్తానని బాండ్ పత్రంపై సంతకం చేసి చూపిస్తున్న కొత్త మనోహర్‌రెడ్డి

మీర్‌పేట: తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఐదు హామీలను నెరవేరుస్తానని మహేశ్వరం బీఎస్‌పీ అభ్యర్థి కొత్త మనోహర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బాండ్ పత్రంపై సంతకం చేసి పవిత్రమైన హనుమాన్ ఆలయం సాక్షిగా ఐదు హామీలను నెరవేరుస్తానని అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలోని నిరుపేద ప్రతి కుటుంబానికి 60 గజాల ఇంటి స్థలం, ప్రభుత్వం నిర్మించే డబుల్ ఇళ్లను స్థానికులకు కేటాయించేలా చేస్తానని, నియోజకవర్గంలో లక్ష మందికి ఉద్యోగాలు కల్పిస్తానని, మీర్‌పేట, బడంగ్‌పేట కార్పొరేషన్లలో అధిక ఇంటి పన్నులను తగ్గిస్తానని, ఎన్టీఆర్‌నగర్ వాసులకు ఇళ్ల పట్టాలు ఇప్పించే బాధ్యత తీసుకుంటానని ప్రకటించారు.

మలక్‌పేటలో కాంగ్రెస్ గెలుపు ఖాయం

అభ్యర్థి షేక్ అక్బర్



ప్రచార ముగింపు సభలో మాట్లాడుతున్న షేక్ అక్బర్

మలక్‌పేట: మలక్‌పేటలో మూడు రంగుల జెండా రెపరెపలాడటం ఖాయమని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షేక్ అక్బర్ అన్నారు. ఎన్నికల ప్రచారం ముగింపు రోజైన మంగళవారం ఆయన మూసారంబాగ్ ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ టీ–జంక్షన్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీల మోసపూరిత వాగ్దానాలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. పారదర్శకమైన పాలన అందించే కాంగ్రెస్‌తోనే మలక్‌పేట అభివృద్ధి సాధ్యమన్నారు. తనను గెలిపిస్తే కాలనీలు, బస్తీలలో మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తానన్నారు. ప్రజలంతా ఓటింగ్‌లో పాల్గొని హస్తం గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. చావుని, ఆజంపురా, ఓల్డ్‌మలక్‌పేట, అక్బర్‌బాగ్, సైదాబాద్, మూసారంబాగ్ డివిజన్లలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీనియర్ నేతలు మండడి విజయసింహారెడ్డి, బాలకృష్ణ యాదవ్, నాయకులు లింగాల శ్రీనివాస్‌గౌడ్, బోనగిరి చంద్రశేఖర్, గంట్ల కృష్ణ, రవీందర్‌యాదవ్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా శైలజారెడ్డి



నాగోలు: తెలంగాణ మహిళా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎల్‌బీనగర్ నియోజకవర్గం నాగోలు డివిజన్ ఎన్విరాన్ టవర్స్‌లో నివాసం ఉండే శైలజారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు అఖిల భారత మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నెట్టా డిసౌజా ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం రాత్రి నాగోలు జరిగిన కాంగ్రెస్ సమావేశంలో నియామక పత్రాన్ని శైలజారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన అఖిల భారత మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నెట్టా డిసౌజాకు, ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నాలుగోసారీ ఎగిరేది గాలిపటమే

మలక్‌పేట మజ్లిస్ అభ్యర్థి బలాల



మలక్‌పేట: నాలుగోసారీ మలక్‌పేటలో ఎగిరేది గాలిపటమేనని మజ్లిస్ పార్టీ అభ్యర్థి అహ్మద్ బలాల అన్నారు. ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా మంగళవారం నియోజకవర్గ పరిధిలో మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బలాల మాట్లాడుతూ, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్రచారంలో మజ్లిస్‌కు బాసటగా నిలిచారన్నారు. ఎక్కడికి వెళ్లినా విశేష స్పందన, ఆదరాభిమానాలు చూపించారన్నారు. ఈ ఎన్నికల్లో మజ్లిస్ విజయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఓల్డ్‌మలక్‌పేట, అక్బర్‌బాగ్, ఆజంపురా, చవుని సైదాబాద్ ప్రాంతాలలో బైక్ ర్యాలీ కొనసాగా.. పార్టీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వినూత్న ప్రచారం



ఎన్నికల ప్రచారానికి చివరి రోజు కావడంతో మంగళవారం ఎల్బీనగర్ లో స్వతంత్ర అభ్యర్థి వీరభోగ వసంత రాయుడు తన ఎన్నికల గుర్తు అయిన కుట్టు మిషన్‌తో ఇలా రోడ్డుపై కూర్చుని వినూత్నంగా ప్రచారం చేశారు.

ఘనంగా మహా అన్నకూట మహోత్సవం

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో మహా అన్నకూట మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో సుల్తాన్‌షాహీ జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ రాకేష్ తివారీ, చార్మినార్ బీజేపీ అభ్యర్థి మెఘూరాణి అగర్వాల్, టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు నాగ్‌నాథ్ మాశెట్టి దంపతులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు కాంగ్రెస్ గెలుపు సోపానాలు

మహేశ్వరం అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీగా ఇచ్చిన ఆరు గ్యారంటీ స్కీమ్‌ల పట్ల ప్రజలు ఆకర్షితులవుతున్నారని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని ఆ పార్టీ మహేశ్వరం ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం ఆర్‌కేపురంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవ భాస్కర్‌రెడ్డి, పున్న గణేష్, చిలుక ఉపేందర్‌రెడ్డిలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో మహేశ్వరంలో నియోజకవర్గంలో మార్పు తథ్యమన్నారు. రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, గడీల పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాగానే దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మాదిరిగా ప్రజా దర్బార్ నిర్వహించి, ప్రజల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చాక అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తామన్నారు. సేవ చేసేందుకు రాజకీయాలకు వచ్చానని, హస్తం గుర్తుపై ఓటు వేసిన తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తనను గెలిపిస్తే మీకు సేవకుడిగా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బోయిన శంకర్ యాదవ్, బండి మధుసూదన్‌రావు, ధనరాజ్‌గౌడ్, గట్టు రవీంద్ర, ఏవీ రావు, శేఖర్ ముదిరాజు, పగడాల శ్రీశైలం, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి తదితరులు

ఆర్‌కేపురంలో ర్యాలీ...

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తుందని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు మంగళవారం మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణ పురం, సరూర్ నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. హస్తం గుర్తుకు ఓటు వేసి కేఎల్లార్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి, సరూర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోని శంకర్ యాదవ్, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్ నేత తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌కేపురంలో కాంగ్రెస్ ర్యాలీని ప్రారంభిస్తున్న దేప భాస్కర్‌రెడ్డి

బీఆర్ఎస్ వైపే యాకుత్‌పురా ప్రజల మొగ్గు

అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి

సైదాబాద్: సమర్థ పాలన కోరుకుంటున్న పాతబస్తీ ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరించి గెలిపిస్తారని యాకుత్‌పురా బీఆర్ఎస్ అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి అన్నారు. ప్రచార పర్వం ముగింపు సందర్భంగా మంగళవారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఐఎస్‌సదన్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. యువకులు పార్టీ పాటలకు చిందులు వేస్తూ ర్యాలీలో ఉత్సాహంగా ముందుకు సాగారు. ఈ సందర్భంగా సామ సుందర్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌కు తిరుగులేని మెజారిటీతో గెలిపించి కేసీఆర్‌ను ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిని చేస్తారని అన్నారు. పాతబస్తీలో బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలు నమ్ముతున్నారని అన్నారు. అందుకే యాకుత్‌పురా ప్రజలు ఈసారి ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ర్యాలీలో ఐఎస్‌సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నారెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డి, కార్తీక్‌గౌడ్, శివకుమార్ పాల్గొన్నారు.



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న సామ సుందర్‌రెడ్డి

అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

నాగోలు: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సరూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని వైన్ షాపులు, బార్లు, కల్లు దుకాణాలకు మంగళవారం సాయంత్రం 5 గంటలకు సీల్ వేశారు. రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ డేవిడ్ రవికాంత్, అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య, జిల్లా అధికారి రవీంద్రరావు ఆదేశాల మేరకు సరూర్‌నగర్, ఎల్‌బీనగర్ పరిధిలో ఉన్న వైన్స్ షాపులు బార్లు, కల్లు దుకాణాలను మూసివేశారు. వైన్స్‌ను తిరిగి 30వ తేదీన పోలింగ్ ముగిసిన తర్వాత తెరుస్తారని తెలిపారు. ఈ సందర్భంగా సరూర్‌నగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఎన్నికల నియమావళి మేరకు అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




వైన్ షాపులను మూసివేయిస్తున్న సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు

బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు పీచర మృతి


చైతన్యపురి: బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యుడు, ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత పీచర వెంకటేశ్వరరావు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. మధుమేహవ్యాధితో బాధ పడుతున్న పీచర కొన్ని రోజుల క్రితం ఆసుపత్రిలో చేరగా ఆయనకు వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆయన చివరి శ్వాస విడిచారు. గడ్డిఅన్నారం డివిజన్ బీఆర్ఎస్ నాయకులు పలువురు పీచర మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పీ అండ్ టీ కాలనీలో జరిగిన కార్యక్రమంలో పీచర చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్, సీనియర్ నాయకులు బిచినేపల్లి వెంకటేశ్వరరావు, ఆనంద్‌గౌడ్, గండి సన్నీ యాదవ్, అశోక్‌గౌడ్, నాగరాజు, విక్కిగౌడ్, శైలజ, మల్లిక, విజయలక్ష్మి, వాణి, అరుంధతి, లక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



పీచర వెంకటేశ్వరరావు


అభ్యర్థులందరినీ చూడండి - అర్హుడినైతే ఆదరించండి
మన భవిష్యత్తు - మన చేతిలో.
నా లక్ష్యం..
టీచర్లుండే పాఠశాలలు
డాక్టర్లుండే ఆస్పత్రులు
రోడ్లున్న గ్రామాలు
ఉపాధినిచ్చే పరిశ్రమలు
సంతోషంగా రైతులు
సంతృప్తిగా గృహిణులు
మార్పు కావాలి కాంగ్రెస్ రావాలి
కిచ్చన్నగారి లక్ష్మా రెడ్డి
కాంగ్రెస్ పార్టీ ఎం.ఎల్.ఏ అభ్యర్థి, మహేశ్వరం నియోజకవర్గం
04
కిచ్చన్నగారి లక్ష్మా రెడ్డి
KLR
తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ కు ఒక అవకాశం ఇద్దాం!
చెయ్యి గుర్తుకే ఓటేద్దాం!


కారు గుర్తుకే
మన ఓటు
నమస్కారం!
మన మహేశ్వరం నియోజకవర్గ ప్రగతి ప్రస్థానంలో మీ సహకారం మరువలేనిది. గత ఎన్నికల్లో నాపై సంపూర్ణ విశ్వాసం తో నియోజకవర్గ బాధ్యతలను నాకు అప్పగించారు. మీరు నాపై ఉంచిన నమ్మకాన్ని నిత్యం కాపాడుకుంటూ. నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ కె. చంద్రశేఖర్ రావు గారి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధి కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగింది. ఆ ప్రగతి ఫలాలు ఇప్పుడు మీ కళ్లెదుటే ఉన్నాయి.. మహేశ్వరం నియోజకవర్గ ప్రతినిధిగా ఇక్కడి ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేశాను.
ఈ అభివృద్ధి ఇలాగే నిరాటంకంగా కొనసాగాలంటే మీ ఆశీర్వాదం నాకు మరోసారి కావాలి. రానున్న ఐదేళ్లు మనందరం కలిసి మన నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకువెళదాం.
మీ...
పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి
BRS పార్టీ అభ్యర్థి, మహేశ్వరం నియోజకవర్గం
అభివృద్ధి కొనసాగాలంటే...
మళ్ళీ సబితమ్మే రావాలి...
పోలింగ్ తేదీ
30-11-2023
సమయం
ఉదయం 7:00 గంటల నుండి
సాయంత్రం 5:00 గంటల వరకు
3
పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి
PATLOLLA SABITHA INDRA REDDY
پٹلولا سبیتا اندرا ریڈی
భారత రాష్ట్ర సమితి


జై తెలంగాణ!
ప్రజా సేవకుడే... ప్రజా నాయకుడు
జై జై తెలంగాణ!!
కంటి ముందు అభ్యర్థి - ఇంటి ముందు అభివృద్ధి
విజ్ఞులైన ఎల్.బి.నగర్ నియోజకవర్గ ఓటరు
మహాశయులకు విన్నపం. ఎల్.బి.నగర్ బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి
శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారి
కారు గుర్తు పై మీ అమూల్యమైన ఓటును వేసి
సుధీర్ రెడ్డి గారిని అత్యధిక మెజారిటీతో గెలిపించగలరని ప్రార్థన.
మన ఓటు మన తెలంగాణకే
మన ఓటు కారు గుర్తుకే
నెం.
అభ్యర్థి పేరు
గుర్తు
2
దేవిరెడ్డి సుధీర్ రెడ్డి
కారు గుర్తుకే మన ఓటు
పోలింగ్ తేదీ : 30-11-2023